
నమస్తే తెలంగాణ
హనుమకొండ
5 | వరంగల్, సోమవారం 25 నవంబర్ 2024 | HANUMAKONDA



మహాధర్నా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎర్రబెల్లి, సత్యవతి, కవిత, రెడ్యానాయక్, శంకర్‌నాయక్

# మానుకోట.. పోరుబాట

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నేడు మహాధర్నా

## లగచర్ల గిరిజనులకు బాసటగా గులాబీ దళం

- హాజరుకానున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ధర్నా స్థలిని పరిశీలించిన మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు
- గిరిజనులు, రైతులు తరలిరావాలని పిలుపు

*కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో గిరిజన రైతులపై రాష్ట్ర ప్రభుత్వ దమనకాండకు నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ ఆందోళనలకు శ్రీకారం చుట్టింది. వారికి బాసటగా నిలిచేందుకు గులాబీ దళం పోరుబాట పట్టింది. ఇందులో భాగంగా 25న (సోమవారం) మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మహాధర్నాకు సంకల్పించింది. ఉద్యమ సమయంలో తెలంగాణ ద్రోహులను రాళ్లతో తరిమికొట్టిన మానుకోటనే ఇందుకు వేదికగా చేసుకొని రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు సిద్ధమైంది. మొదట ఈ నెల 21న మహాధర్నా నిర్వహించాలనుకున్నప్పటికీ సర్కారు ఒత్తిడితో పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో పార్టీ నేతలు హైకోర్టును ఆశ్రయించడంతో అనుమతినివ్వగా, శాంతియుత ధర్నాలో పాల్గొనేందుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు ఆదివారం ధర్నా స్థలిని పరిశీలించారు. జిల్లాలోని గిరిజనులు, రైతులు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు.*

*- మహబూబాబాద్, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ)*



మహాధర్నా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన రైతులపై చేస్తున్న దాడులను నిరసిస్తూ బీఆర్‌ఎస్ పోరుబాట పట్టింది. మానుకోట గడ్డ నుంచి రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు సిద్ధమైంది. కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో తమ భూములు ఇవ్వమని ఖరాకండిగా తేల్చిచెప్పిన గిరిజన రైతులను రాష్ట్ర సర్కారు పోలీసులతో అతి దారుణంగా కొట్టించి, అక్రమ కేసులు పెట్టి జైల్లోకి నెట్టింది. దీనిని నిరసిస్తూ కొన్ని రోజులుగా బీఆర్‌ఎస్ పోరాటం చేస్తున్నది. ఈ క్రమంలో గిరిజనులు అధికంగా ఉన్న మానుకోట జిల్లాలో ధర్నా నిర్వహించాలని గులాబీ పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా తహసీల్దార్ కార్యాలయం సెంటర్‌లో మహాధర్నా చేపట్టేందుకు నిర్ణయించారు. ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరుకానున్నారు. ముందుగా ఈనెల 21న ధర్నా నిర్వహించేందుకు నిర్ణయించగా పోలీసులు అనుమతి ఇవ్వలేదు. జిల్లాకు చెందిన కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సైతం కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటామని బహిరంగంగానే ప్రకటించారు. ఈ నేపథ్యంలో ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేశారు. అనంతరం జిల్లా నేతలు హైకోర్టును ఆశ్రయించగా ఈ నెల 25న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మహాధర్నాకు అనుమతినిచ్చింది. దీంతో బీఆర్‌ఎస్ శ్రేణులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. గిరిజన రైతుల్లో మనోధైర్యం నింపి, అండగా నిలవాలనే ఉద్దేశంతో మానుకోటలో మహాధర్నా నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం 8 గంటలకు హైదరాబాద్ నుంచి కేటీఆర్ బయలుదేరి 10గంటలకు మానుకోటకు చేరుకొని మహాధర్నాలో పాల్గొన్న అనంతరం తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారు. జిల్లాలోని గిరిజనులు, రైతులు స్వచ్ఛందంగా తరలిరావాలని బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు పిలుపునిచ్చారు.

**ధర్నా స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు**

పట్టణంలోని ధర్నా నిర్వహించే ప్రాంతాన్ని ఆదివారం మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీ, పార్టీ అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ అంగోతు బిందు, బీరవెల్లి భరత్ కుమార్‌రెడ్డి తదితర నాయకులు పరిశీలించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో ఎమ్మెల్సీలు సత్యవతిరాథోడ్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్

# రేవంత్‌ది నియంత పాలన

**ప్రజాసామ్యాన్ని ఖూనీ చేస్తున్న సీఎం**

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు
- బీఆర్‌ఎస్ ధర్నాతో ముఖ్యమంత్రికి వణుకు
- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్
- ఎమ్మెల్సీ, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి విలేకరుల సమావేశం

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 24 : రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలను ఖూనీ చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి నియంత పాలన కొనసాగిస్తున్నాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీలు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ, జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ పది సంవత్సరాల్లో గిరిజనుల కోసం ఎంతో చేసిందన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా చేసి ఎంతో మందిని సర్పంచ్‌లు చేయడంతో పాటు వారికి పది శాతం రిజర్వేషన్ కల్పించి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి గిరిజన భూములను లాక్కుంటూ వారిపై దాడులు చేయిస్తున్నాడని, ఇంత నీచమైన పాలన ఎప్పుడూ చూడలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలనను చూసి ప్రజలు ఛీదరించుకుంటున్నారని పేర్కొన్నారు. మానుకోటలో గిరిజనులు ఎక్కువ మంది ఉన్నారని, లగచర్ల రైతులకు మద్దతుగా శాంతియుతంగా రైతుల పక్షాన ధర్నా నిర్వహించుకుంటామంటే అనుమతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. కోర్టు రైతుల పక్షాన ఆలోచించి ధర్నాకు అనుమతి ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి పాలనపై తీవ్ర వ్యతిరేకత మొదలైందని, ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీ పక్షాన ఉన్నారని, సోమవారం నిర్వహించనున్న రైతుల ధర్నాకు బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని, రైతులు తరలివచ్చి శాంతియుతంగా ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బిందు, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, భరత్‌కుమార్ రెడ్డి, పర్కాల శ్రీనివాస్ రెడ్డి, రవికుమార్, ఎడ్ల వేణు, జేరిపోతుల వెంకన్న, మంగళంపల్లి కన్న, తేళ్ల శ్రీను, లునావత్ అశోక్‌నాయక్, షేక్ ఖాదర్ బాబా, మార్నేని రఘు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రికి వణుకు పుడుతోంది



మానుకోట గడ్డపై కేటీఆర్ ఆధ్వర్యంలో లగచర్ల రైతులకు మద్దతుగా గిరిజన రైతుల మహాధర్నాకు పిలుపునివ్వడంతో సీఎం రేవంత్ రెడ్డిలో వణుకు పుడుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు గూండాయిజం చేస్తూ అమాయకులపై దాడులు చేస్తున్నారు. పేదల పక్షాన బీఆర్‌ఎస్ పార్టీ పోరాటం చేస్తున్నది. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు రెచ్చగొట్టే విధానాలు మానుకోవాలి. గిరిజన ఎమ్మెల్యేలు, ఎంపీలు లగచర్ల రైతులకు మద్దతుగా ఉండి వారి పక్షాన పోరాటం చేయాలి. మహాధర్నాకు అన్ని సంఘాల నాయకులు కలిసి రావాలి. లగచర్ల రైతులు చాలా అమాయకులు. వారి భూముల కోసం ప్రతి ఒక్కరూ మద్దతు తెలిపి శాంతియుతంగా పోరాటం చేయాలి.

– మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

### పోలీసులపై ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్నది



అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పోలీసులపై తీవ్రమైన ఒత్తిడి తీసుకువస్తున్నది. ఆ పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీ గిరిజన రైతుల ధర్నాను అడ్డుకుంటాం, రాళ్లతో కొడతామని ద్రోహుల్లా మాట్లాడుతున్నారు. పోలీస్ యంత్రాంగం అప్రమత్తమై అలాంటి సంఘ విద్రోహ శక్తులను తరిమికొట్టాలి. గిరిజన రైతుల పక్షాన శాంతియుతంగా ధర్నా చేసుకుంటామంటే ఈ నెల 21న కాంగ్రెస్ పార్టీ నాయకులు రెచ్చగొట్టడంతో ఎస్పీ అనుమతి నిరాకరించారు. హైకోర్టు అనుమతివ్వడంతో నేడు పట్టణంలోని ఎమ్మార్వో సెంటర్‌లో మహా ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నాం. కేటీఆర్ హాజరవుతున్నారు. విజయవంతం చేయాలి.

–ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్ రావు

### కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యతిరేకత



లగచర్ల గిరిజన రైతులపై జరిగిన దాడితో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి బుద్ధి రావాలి. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో అనేక అరాచకాలు జరుగుతున్నాయి. ఓ మాజీ సర్పంచ్‌పై విపరీతమైన ఒత్తిడి చేయడం వల్ల సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న ఘటన దుర్మార్గం. జిల్లాలోని ప్రజా, గిరిజన సంఘాలు లగచర్ల రైతులకు మద్దతు తెలపాలి. ప్రతి ఒక్కరూ కలిసిరావాలి. రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం చేసి దుమ్ములో కొట్టుకుపోయాడు.

– మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత

### గిరిజన సంఘాలు కలిసి రావాలి



మహాధర్నాకు గిరిజన సంఘాల నాయకులు కలిసి రావాలి. సీఎం రేవంత్ రెడ్డి కావాలనే లగచర్ల భూముల కోసం గిరిజన రైతులపై దాడులు చేయించి వారిని జైల్లో పెట్టించాడు. ఆయన గిరిజనులపై దారుణంగా వ్యవహరించి ఒత్తిడి చేస్తున్నాడు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమ కోసం అనేక పథకాలు తీసుకువస్తే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గిరిజన రైతుల భూములను గుంజుకోవాలని చూస్తున్నది.

– మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

### హామీలను విస్మరించిన రేవంత్



పేదలకు అనేక హామీలు ఇచ్చి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే తులం బంగారం, మహిళలకు భద్రత, రైతు భరోసా వంటి హామీలను పూర్తిగా విస్మరించాడు. ఆయన రాగానే ఆర్థిక వ్యవస్థ కుంటుపడింది. హైదరాబాద్‌లో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రభుత్వంపై వ్యతిరేకత రావడంతో బీఆర్‌ఎస్ పార్టీపై ఇష్టం వచ్చిన విధంగా మాట్లాతున్నాడు. ప్రజలు ఓట్ల రూపంలో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్తారు.

–మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్

*దేశంలో వంట నూనెల లోటును పూడ్చేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన ఆయిల్‌పామ్ తోటల సాగు సత్ఫలితాలనిస్తున్నది. వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్‌ను తెరపైకి తెచ్చిన అప్పటి సర్కారు దాన్ని సాగు చేసేలా రైతులను చైతన్యపరిచింది. ఇందులో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని 3,649.57 ఎకరాల్లో 1,229 మంది రైతులు ఈ పంటను సాగు చేయగా, ఇందులో మొదటి విడతగా 352.55 ఎకరాల్లో క్రాప్ వస్తున్నది. దీన్ని జూన్‌లో విక్రయించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను ఆయిల్ పామ్‌కు రూ. 19,144 ధర ఉండగా, పంట కోత ప్రారంభం కావడంతో ఇక నెల నెలా ఆదాయం సమకూరనుంది. ఈ క్రమంలో నైన్‌పాకలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వేగవంతం చేయగా, జిల్లాతోపాటు ఇతర జిల్లాల రైతులు సైతం ఇక్కడికే వచ్చి తమ పంటను విక్రయించుకునే అవకాశం ఉంది.*

*- జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ)*

- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 3,649.57 ఎకరాల్లో సాగు
- కోత దశలో 352.55 ఎకరాలు..
- ఇక నెలనెలా రైతుకు ఆదాయం
- టన్నుకు రూ. 19,144 ధర.. ఎకరాకు 5 నుంచి 10 టన్నుల దిగుబడి
- నైన్‌పాకలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు వేగవంతం
- ఇక ఇతర జిల్లాల క్రాప్ ఇక్కడికే






ఆయిల్‌పామ్ చెట్లకు ప్రారంభమైన గెలలు

# ప్రోత్సాహమిచ్చె.. దిగుబడి వచ్చె

## ఆయిల్‌పామ్ పంట సాగుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ ప్రయత్నం సక్సెస్

ఆయిల్ పామ్ సాగుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించింది. సాగుతో లాభాలు, అంతర పంటలతో అదనపు ఆదాయం గురించి వివరించి రైతులకు అవగాహన కల్పించింది. ఈక్రమంలో రైతులు ఆయిల్‌పామ్ సాగువైపు మొగ్గు చూపారు. జయశంకర్ భూపా లపల్లి జిల్లాలో 3649.57 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట సాగవగా, ఇందులో 352.55 ఎకరాల్లో పంట కోత దశకు వస్తున్నది. ఈ పంటను జూన్‌లో విక్రయించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఒకసారి ప్రారంభమైన క్రాప్ ఇక ప్రతి నెలా రైతులు విక్రయించుకునే వీలుంది. ఇలా నిరవధికంగా 30 ఏళ్లపాటు నెలనెలా ఆదాయం పొందే అవకాశం ఉంది. ఎకరాకు 5 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ప్రస్తుతం మార్కెట్‌లో ఆయిల్ పామ్‌కు రూ. 19144 ధర ఉందని అధికారులు తెలుపుతున్నారు. పంట దిగుబడి వస్తుండడంతో సువెన్ అగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులను ప్రారంభించింది.

**352.55 ఎకరాల్లో క్రాప్ ప్రారంభం**

జిల్లాలోని 11 మండలాల్లో 10 మండలాలకు చెందిన 112 మంది రైతులు 2021–22లో మొదటి విడతగా 352.55 ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలు నాటగా ప్రస్తుతం దిగుబడి ప్రారంభమైంది. భూపాలపల్లి మండలంలో 42.10 ఎకరాలు, చిట్యాలలో 75.35, ఘణపురంలో 16.60, మొగుళ్లపల్లిలో 77.43, రేగొండలో 73.05, టేకుమట్లలో 14.58, కాటారంలో 5.38, మహాముత్తారంలో 37.63 ఎకరాలు, మల్హర్‌లో 10.43 ఎకరాల్లో మొదటి విడత వేయగా పంట దిగుబడి షురూ అయింది. అలాగే 2022–23లో 609 మంది రైతులు 1877.53 ఎకరాల్లో, 2023–24లో 411 మంది రైతులు 1163.90 ఎకరాలో, 2024–25లో 97 మంది రైతులు 255.58 ఎకరాల్లో ఆయిల్‌పాం పంటను సాగు చేశారు. మొత్తం 3649.57 ఎకరాల్లో సాగు కాగా ఇంకా ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు రైతులు ఉత్సాహం కనబరుస్తున్నారు. పంట మొదటి సంవత్సరం నుంచి నాలుగేళ్ల వరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎకరానికి రూ. 4200 సబ్సిడీ అందించింది. ఒక్కో మొక్కకు రూ.223 ఉండగా రూ.193 సబ్సిడీ ఇచ్చింది.

**నైన్‌పాకలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ**

పంట దిగుబడి ప్రారంభం కాబోతుండడంతో సువెన్ అగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులను చిట్యాల మండలం నైన్‌పాక గ్రామంలో ప్రారంభించింది. అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు కొనసాగుతుండగా, తాగునీటి సౌకర్యార్థం 5 బోర్లు వేశారు. ఏడాదిలోగా ఫ్యాక్టరీని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు జిల్లా హార్టికల్చర్ అధికారి సంజీవరావు ఫ్యాక్టరీ పనులను పరిశీలించారు. ఫ్యాక్టరీ పూర్తయితే పెద్దపల్లి, ములుగు, వరంగల్ జిల్లాల నుంచి ఆయిల్‌పాం పంటను రైతులు ఇక్కడికే తీసుకువచ్చి విక్రయించుకునే వీలుంది.




రోడ్డు ప్యాచ్ వర్క్‌కు నీళ్లు పోస్తున్న ట్రాఫిక్ పోలీసు

# ఇదేనా ట్రాఫిక్ డ్యూటీ?

- వరంగల్ నగరంలో సిబ్బందికి ఇతర పనులు
- అధికారుల హుకుంతో రోడ్ల ప్యాచ్ వర్కులు, మొక్కలకు నీళ్లు
- డివైడర్లకు కలరింగ్, వీధి దీపాలకూ మరమ్మతులు

సుబేదారి, నవంబర్ 24 : వరంగల్ నగరంలో రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరిగిపోతున్నది. దీంతో ట్రాఫిక్ సమస్య వేధిస్తున్నది. ఈ నేపథ్యంలో దీన్ని ఎప్పటికప్పుడు చక్కదిద్దాల్సిన ట్రాఫిక్ అధికారులు సిబ్బందిని ఇతర పనులు చేయాలని హుకుం జారీ చేయమనడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు ముందు నుంచే హనుమకొండ, కాజీపేట, వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బంది, సివిల్, ఏఆర్ సిబ్బంది, హోంగార్డ్స్‌ను ట్రాఫిక్ సిగ్నల్స్ పాయింట్ల వద్ద లైటింగ్, గుంతలు ఉన్న రోడ్ల వద్ద సిమెంట్ ప్యాచ్ వర్కులు, డివైడర్లకు కలరింగ్ పనులు చేయాలని ఆదేశించారు. దీంతో కొద్ది రోజుల నుంచి సిబ్బంది ఈ పనులన్నీ చేస్తున్నారు. డ్రెస్‌కోడ్‌లో డ్యూటీ చేస్తూనే ఈ పనులు కూడా చేస్తున్నామని, ఇది అవమానంగా ఉందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులన్నీ మున్సిపల్ డిపార్ట్‌మెంట్ నుంచి చేయాల్సి ఉండగా, ట్రాఫిక్ సిబ్బందితో చేయించడం విమర్శలకు తావిస్తున్నది.



విద్యుత్ దీపానికి మరమ్మతు చేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్



ఖిలా వరంగల్ ఖుష్‌మహల్ వద్ద నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

# ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- కేఎంసీ నుంచి వరంగల్ కోటకు హిస్టారికల్ రన్ అండ్ రైడ్
- ప్రారంభించిన ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు కాళీప్రసాద్
- పరుగుపందెం, సైక్లింగ్‌లో పాల్గొన్న మెడికల్ విద్యార్థులు

వరంగల్ చౌరస్తా, నవంబర్ 24: కాకతీయ మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హిస్టారికల్ రన్ అండ్ రైడ్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కేఎన్‌ఆర్ సైక్లింగ్ ఈవెంట్స్ ఆర్గనైజేషన్ ఐఎంఏ వరంగల్ విభాగంతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు కాళీప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రను ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదనే విషయాన్ని ప్రతి ఒక్కరికీ గుర్తు చేస్తూ, మనిషి ఆరోగ్యం కోసం చేయాల్సిన రెండు పనులను ఇందులో పోటీలుగా నిర్వహించడం ఆనందంగా, ఆసక్తిగా ఉందని అన్నారు. శారీరక శ్రమ తగ్గిపోయి యాంత్రిక జీవనానికి అలవాటు పడుతున్న ఈ రోజుల్లో పరుగు, సైక్లింగ్‌పై అవగాహన, ఆసక్తిని పెంచడం కోసం కేఎన్‌ఆర్ సైక్లింగ్ ఈవెంట్స్ సంస్థ ఐఎంఏ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మూడు, ఐదు, పది కిలోమీటర్ల పరుగు పందెంతో పాటుగా 10 కిలోమీటర్ల సైక్లింగ్ పోటీ నిర్వహించారు. కేఎంసీ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన పందెం ఖిలా వరంగల్ ఖుష్‌మహల్ వరకు సాగింది. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు చేస్తూ ఆనందాన్ని పంచుకున్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఐఎంఏ వరంగల్ విభాగం అధ్యక్షుడు అన్వర్ మియా, పలువురు ప్రముఖ వైద్యులు ఉత్సాహంగా పాల్గొని సైకిల్ తొక్కారు. సుమారు 600 మంది మెడికల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీ ప్రసాద్, చిత్రంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, వైద్యులు శేషుమాధవ్, అన్వర్‌మియా, ఎస్ రమేశ్

### లక్నవరంలో రయ్.. రయ్..



ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరంలో పర్యాటకులు, విద్యార్థులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేలాడే వంతెన మీదుగా బోటింగ్ పాయింట్‌కు చేరుకొని సరస్సులో పెద్ద బోటుతో పాటు స్పీడ్ బోటులో రయ్.. రయ్.. మంటూ షికారు చేశారు.

- గోవిందరావుపేట, నవంబర్ 24

# శోభావతికి నిస్వార్థ సేవా పురస్కారం

హైదరాబాద్‌లో అందజేసిన ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధులు

పోచమ్మమైదాన్, నవంబర్ 24: ప్రముఖ మిమిక్రీ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్ సతీమణి, వరంగల్ ఇన్నర్ వీల్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు నేరెళ్ల శోభావతికి నిస్వార్థ సేవా పురస్కారం అందజేశారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ఇంటర్నేషనల్ ఇన్నర్ వీల్ క్లబ్ ప్రతినిధుల సమావేశంలో అధ్యక్షురాలు మమతా గుప్తా, అసోసియేషన్ అధ్యక్షురాలు సునీతా జైన్, డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ ప్రేమలత చేతులమీదుగా శోభావతి అవార్డు అందుకున్నారు. క్లబ్ ద్వారా నాలుగున్నర దశాబ్దాల నుంచి నిస్వార్థంగా అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డును అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా నుంచి క్లబ్ అధ్యక్షురాలు ఎన్ లావణ్య, ప్రధాన కార్యదర్శి ఎం రేణుక, కోశాధికారి సబిత, ఐఎస్‌వో రవళి, ఎడిటర్ వినీల, పూర్వ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్లు డాక్టర్ కస్తూరి ప్రమీల, సుమతినాయుడు, పద్మా శర్మ, సునీత వల్లం, సభ్యులు పాల్గొన్నారు.



శోభావతికి అవార్డు అందజేసి సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు